క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాణి శిరీష తదితరులు

మారేడుమిల్లి: మండల కేంద్రంలోని మాసిదోనియ చర్చి పాస్టర్ శామ్యూల్ ఆధ్వర్యంలో బుధవారం ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ రాణి శిరీష ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు. కంటి వైద్య నిపుణులు శ్యామ్ మాట్లాడుతూ కంటి వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం స్వయం సహాయక ఉపాధిపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా డిటర్జెంట్ పౌడర్, రూమ్ ఫ్రెషనర్, పినాయిల్ తదితర కెమికల్, హెర్బల్ ప్రొడక్ట్స్ తయారీపై శిక్షణ ఇచ్చినట్టు పాస్టర్ శ్యాముల్ చెప్పారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ బేసు, ఎంపీటీసీ నాగరాజు

హుకుంపేట: మండలంలోని ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతం కామయ్యపేటలో రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ పాంగి బేసు, ఎంపీటీసీ సభ్యుడు కొర్ర నాగరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కామయ్యపేట నుంచి 4 కిలోమీటర్లలోని తీగలవలస గ్రామం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్టు వారు తెలిపారు. గతంలో గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉండేవి, ప్రస్తుతం రహదారులకు మోక్షం కలిగిందన్నారు. మాజీ ఎంపీటీసీ రామారావు, వార్డు సభ్యులు శంకర్‌రావు, నాయకుడు అప్పారావు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

దుంబ్రిగుడ: మండలంలోని కురిడి గ్రామ సమీపంలో బుధవారం జరిగిన ప్రమాదంలో బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. ఒడిశా రాష్ట్రం కింజేరు నుంచి బైక్‌పై కిల్లో సన్యాసిరావు , కిల్లో చిలకమ్మ చింతపల్లి పంచాయతీ కొక్కులవీధి గ్రామానికి వెళ్తుండగా దుంబ్రిగుడ మండలం కురిడి గ్రామం వద్ద ఈ బైక్ అదుపు తప్పి సమీపంలోని లోయలోకి దూసుకుపోయింది. స్థానికులు హుటాహుటిన స్పందించి ప్రమాదంలో స్వల్పగాయాలైన ఇరువురిని 108 అంబులెన్స్‌లో అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో వారికి స్వల్పగాయాలవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

ఆధార్ కేంద్రాల పరిశీలన



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతయ్య

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ బాలరేవులలో ఏర్పాటు చేసిన రెండు మొబైల్ ఆధార్ కేంద్రాలను ఎంపీడీవో లాలం సీతయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆధార్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. నాలుగు రోజుల పాటు ఈ కేంద్రాలు రెండు కొనసాగుతాయన్నారు. గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ ప్రాధాన్యతను ఆయన వివరించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఆధార్ కేంద్రం నిర్వాహకులు బుజ్జి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మారేడుమిల్లి : మండలంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలయ్యాయి. రాజమహేంద్రవరానికి చెందిన నిఖిల్, కమల్ అనే ఇద్దరు యువకులు బైకుపై మారేడుమిల్లికి విహారయాత్రకు వచ్చారు. ఇక్కడి ప్రదేశాలను తిలకించి, తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మండలంలోని సున్నంపాడు గ్రామం సమీపం వద్ద ఎదురుగా వస్తున్న మరొక వాహనాన్ని తప్పించబోయి బైకు బోల్తా పడింది. దీంతో బైకుపై ప్రయాణిస్తున్న ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలిచారు.

గ్రామాల్లో సంక్షేమాభివృద్ధి పరవళ్లు

- చింతూరు మండలంలో రూ.కోట్లతో అభివృద్ధి
- రూ.170కోట్లతో సంక్షేమ పథకాలు అమలు
- ఆనందంలో గిరిజనులు





తుమ్మలలో ఆరోగ్యకేంద్రం

చింతూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చింతూరు మండలంలో పేదల చెంతకు సంక్షేమ పథకాలు దరి చేరడంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చోటు చేసుకున్నాయి. సంక్షేమ పథకాలు నేరుగా పేదలకు చేరాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయం, గ్రామ వలంటీరు వ్యవస్థ ద్వారా గ్రామాల్లో ఎంతో మార్పు చోటు చేసుకుంది. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి పథకం ఎలాంటి అవినీతికి తావులేకుండా సత్వరమే తమ చెంతకు చేరుతుండడంతో ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

సంక్షేమ పథకాలు ఇలా

చింతూరు మండలంలో సంక్షేమ పథకాల నిమిత్తం ప్రభుత్వం రూ 170 కోట్లు ఖర్చు చేసింది. 5,209 మంది పింఛను దారులకు రూ.70 కోట్లు ఖర్చు చేయగా రైతు భరోసా ద్వారా 5,400 మంది రైతులకు రూ.31 కోట్లు, అమ్మఒడి పథకం ద్వారా 4,192 మందికి రూ.23 కోట్లు ప్రభుత్వం అందచేసింది. జగనన్న విద్యా దీవెన ద్వారా 800 మంది విద్యార్థులకు రూ 1.60 కోట్లు, వసతి దీవెన ద్వారా 600 మందికి రూ.80 లక్షలు మంజూరయ్యాయి. వైఎస్సార్ చేయూత ద్వారా 2,072 మందికి రూ.10.50 కోట్లు, వైఎస్సార్ ఆసరా ద్వారా 5,908 మందికి రూ 6.98 కోట్లు, వాహనమిత్ర ద్వారా 165 మందికి రూ 65 లక్షలను ప్రభుత్వం అందించింది. మండలంలో 923 మందికి 1,900 ఎకరాలకు కొండపోడు పట్టాలు ఇవ్వడం జరిగింది.

అభివృద్ధి పరవళ్లు

చింతూరు మండలంలో రూ.10 కోట్లతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్‌సెంటర్లు నూతనంగా నిర్మించారు. మండలంలోని 26 గ్రామాలకు రూ.14 కోట్లతో శబరినది ద్వారా తాగునీటి కల్పన పనులు చేపట్టారు. గ్రాఅమల్లో మరో రూ.14కోట్లతో 66 గ్రామాలకు తాగునీటి పథకం , పైపులైన్ పనులు జరిగాయి. రూ 25 కోట్లతో ఏకలవ్య మోడల్ పాఠశాల నూతన భవనం, నాడు–నేడు కింద రూ.16 కోట్లతో 57 పాఠశాలలు అభివృద్ధి చేశారు. చింతూరు ఏరియా ఆస్పత్రిలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ సెంటర్ ఏర్పాటు, రూ.7 కోట్లతో ఏడుగురాళ్లపల్లి నుంచి పాలమడుగు వరకు తారురోడ్డు మంజూరు చేశారు.



చింతూరు మండలం తుమ్మలలో రైతు భరోసా కేంద్రం



చింతూరు మండలం తుమ్మలలో గ్రామ సచివాలయ భవనం

అందరికీ సంక్షేమ పథకాలు



గత ప్రభుత్వాలకు భిన్నంగా ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. అన్ని గ్రామాల్లో విస్తృతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఎన్నడూ ఊహించని విధంగా సంక్షేమం, అభివృద్ధి జరిగింది. సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు నేరుగా మా ఇళ్లకే తీసుకొచ్చి పథకాలు అందిస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది. – కొవ్వాసి భద్రయ్య, గంగన్నమెట్ట

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ముంచంగిపుట్టులో ఉచిత గ్యాస్ కలెక్షన్లు పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ముంచంగిపుట్టు: అర్హులందరికీ మంజూరవుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలో జీసీసీ ఆధ్వర్యంలో ఉచిత గ్యాస్ కనెక్షన్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా పేదలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌లు మంజూరవుతున్నాయన్నారు. అర్హులందరూ ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 10 మంది లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ సీతమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, ఎంపీడీవో కిరణ్‌కుమార్, సర్పంచులు రమేష్, బాబూరావు, భాగ్యవతి, ఎంపీటీసీ సభ్యులు కమల, సుబ్బలక్ష్మి, గణపతి, జీసీసీ సూపరింటెండెంట్ కుమారస్వామి, నాయకులు సన్యాసిరావు, మత్స్యలింగం, జయదేవ్, గాసిరావు, దాసు, అర్జున్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



ఎర్లకొండలో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

వై.రామవరం: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్(అనంతబాబు)లు అన్నారు. మండలంలోని గుర్తేడు, దారగడ్డ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 450 గడపలను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలుచేశారన్నారు. రాష్ట్రంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిపై సీఎం జగనన్న ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. మరిన్ని సంక్షేమ పథకాల సాధన కోసం రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించి, జగనన్నను మరలా ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. గుర్తేడు, దారగడ్డ గ్రామాల్లో సచివాలయాల భవనాలను ప్రారంభించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వీరమళ్ల సుబ్బలక్ష్మి, సాదాల లక్ష్మి, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టండి

వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు



పథకాలపై అవగాహన కల్పిస్తున్న పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : దేశంలో ఎక్కడలేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం నడుస్తోందని రానున్న ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలోని గుత్తులపుట్టు పంచాయతీ వంతాలగుమ్మి గ్రామంలో బుధవారం రాత్రి ఆయన సందర్శించారు. ఇంటింటా వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. టీడీపీ హయాంలో గిరిజనులు అన్ని రంగాల్లో తీవ్ర వివక్షకు గురయ్యారన్నారు. నేడు జగనన్న పాలనలో మారుమూల గ్రామాల్లో జరుగుతుందన్నారు. దశాబ్దాలుగా రహదారి నోచుకోని గ్రామాలకు కూడా నేడు తారురోడ్డు సౌకర్యం కలిగిందన్నారు. గ్రామాల రూపురేఖలు ఎంతగానో మారిపోయిందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించి మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని అభ్యర్థించారు. మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, ఎంపీటీసీ సభ్యుడు దూసురి సన్యాసిరావు, కించూరు సర్పంచ్ వంతాల రాంబాబు, వార్డు సభ్యులు రాంబాబు, కృష్ణ, నాయకులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ పటిష్టతకు కృషి



శ్రీకాంత్ మాస్టర్‌ను సన్మానిస్తున్న వైస్ఎంపీపీ భాగ్యవతి,ఉపాధ్యాయులు..

ముంచంగిపుట్టు: ప్రాథమిక స్థాయిలో విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని వైస్ ఎంపీపీ భాగ్యవతి అన్నారు. మండలంలోని రంగబయలు పంచాయతీ లంగభపోదర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌ను బుధవారం వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భాగ్యవతి తదితరులు ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తూ, వనుగుమ్మ సచివాలయం పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికవడంపై అభినందనలు తెలిపారు.

60 మందికి వైద్య పరీక్షలు



డ్రైవర్లకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీకాంత్

సాక్షి,పాడేరు: జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం పాడేరులోని జీపు స్టాండ్ వద్ద బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. జిల్లా రవాణాశాఖాధికారి లీలాప్రసాద్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యాధికారి బి.శ్రీకాంత్, వైద్య సిబ్బంది 60 మంది వాహన డ్రైవర్లకు వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సహాయ మోటార్ వాహన ఇన్‌స్పెక్టర్ వాసు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



కె.జె.పురం హైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న సర్పంచ్ రమణబాబు

మాడుగుల రూరల్: కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న 43 మంది 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ మళ్ల కిశోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు తదితరుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కాళ్ల అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టరు భీశెట్టి జగ్గప్పారావు, స్థానిక నాయకులు మళ్ల కన్నబాబు, ఎం.వి.సత్యనారాయణ, విశ్రాంతి ఉపాధ్యాయులు అమ్మతల్లి నాయుడు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు గోవిందరాజు, శంకర్, స్కూల్ కమిటీ సభ్యులు, పాఠశాల హెచ్ఎం వి.దాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ 5.60 కోట్ల ధాన్యం కొనుగోలు



కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు

చింతూరు: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం ద్వారా రైతుల నుంచి రూ 5.60 కోట్ల మేరు ధాన్యం కొనుగోలు చేసినట్టు మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మండలంలో ధాన్యం కొనుగోళ్ల నిమిత్తం చింతూరు, పేగ, ఏజీ కొడేరు, చదలవాడలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ప్రభుత్వం సాధారణ ధాన్యానికి రూ 2,183గా మద్దతు ధర ప్రకటించింది. దీంతో మండలంలోని 969 మంది రైతుల నుంచి 64,112 బస్తాలకు సంబంధించి 2,564 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు ఇప్పటివరకు రూ 2.22 కోట్లు చెల్లించగా మిగతా రూ 2.28 కోట్లను త్వరలోనే చెల్లింపులు జరుగుతాయన్నారు. నేరుగా రైతుల కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు ఏవో తెలిపారు.

కుష్టు నివారణకు కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, వైద్యాధికారులు

దుంబ్రిగుడ: మండలంలోని అరకు సంతబయలు గ్రామంలోని సచివాలయ ఆవరణలో కుష్టు వ్యాధి నివారణపై కిల్లోగుడ పీహెచ్‌సీ వైద్యాధికారి కుమార్ రత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు వినియోగించి, సూచనలు పాటిస్తే కుష్టు వ్యాధి దూరమవుతుందన్నారు. కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించి, నిర్మూలనకు కృషి చేస్తామని వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. వ్యాధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలపై రూపొందించిన బ్రోచర్‌ను సర్పంచ్ శారద విడుదల చేశారు.హెల్త్ సూపర్‌వైజర్ జానకమ్మ, సర్పంచ్ సర్పంచ్ శారద, పంచాయతీ కార్యదర్శి జీవన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేత టీమ్‌కి ట్రోఫీని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు తదితరులు

అడ్డతీగల: సంక్రాంతి సందర్భంగా అడ్డతీగలలో నిర్వహించిన అల్లూరి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా అడ్డతీగల ధండర్ బోల్ట్స్ నిలిచింది. స్థానిక అనంత చక్రరావు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఫైనల్స్‌లో ధండర్ బోల్ట్స్ టీమ్, పవర్ షైకర్స్‌పై విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యచ్‌గా అడ్డతీగల ధండర్ బోల్ట్స్ టీం ఆటగాడు విజయ్ నిలిచాడు.మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా ధండర్ బోల్ట్స్ టీమ్‌కు చెందిన కామేష్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా తరుణ్, బెస్ట్ బౌలర్‌గా శేఖర్, బెస్ట్ వికెట్ కీపర్‌గా చందు, బెస్ట్ ఫీల్డర్‌గా పండు ప్రత్యేక బహుమతులు పొందారు. విజేతలకు బహుమతులను గంగవరం ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, అడ్డతీగల ఉప సర్పంచ్ ముప్పనశెట్టి శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు నిమ్మల శ్రీను, వార్డు సభ్యులు, స్థానికులు అందజేశారు. టోర్నీలు 64 టీమ్‌లు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. అల్లూరి యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



గౌరీశంకర్‌కు సన్మానం

అనంతగిరి: మండలంలోని పర్యాటకశాఖ బొర్రా యూనిట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌరీశంకర్ మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పర్యాటకశాఖ డీవీఎం హరిత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ బాధ్యతయుతంగా విధులు నిర్వహించి, ఆయన సేవలను కార్పొరేషన్‌కు అంకితం చేశారని గౌరీశంకర్ సేవలను కొనియాడారు. గౌరీశంకర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతగిరి హరిత యూనిట్ మేనేజర్ బద్రీ, సిబ్బంది రాజు, సోమేష్, గాసి, రాము పాల్గొన్నారు.

మండపల్లిలో ఆధార్ కేంద్రం ఏర్పాటు



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అప్పలసూరి

గూడెంకొత్తవీధి: చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్, పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి చొరవతో మండలంలోని మారుమూల ప్రాంతమైన మండపల్లిలో తాత్కాలిక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కొయ్యూరు, గూడెంకొత్తవీధి మండలాల సరిహద్దులో మండపల్లి గ్రామం ఉంది. గత నెలలో చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిషోర్, పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డిలు ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మారుమూల గిరిజన గ్రామాల్లో గిరిజనులు పలు సమస్యలను తెలియజేశారు. ఆధార్‌కార్డులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నట్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి మండపల్లిలో తాత్కాలికంగా గిరిజనుల సౌకర్యార్థం మొబైల్ ఆధార్‌కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. వారు ఇచ్చిన హామీ మేరకు ఉన్నతాధికారుల చొరవతో ఎట్టకేలకు బుధవారం మండపల్లిలో తాత్కాలిక ఆధార్ కేంద్రం ఏర్పాటైంది. గూడెంకొత్తవీధి ఎస్ఐ అప్పలసూరి ఆధార్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన సహకారాన్ని అందించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామస్తులు ఈ ఆధార్ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఎట్టకేలకు ఆధార్ కేంద్రం అందుబాటులో రావడంతో ఈ ప్రాంత గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తూ, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా మహాత్మా గాంధీ తీర్థం



గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సర్పంచ్ రమణబాబు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో బుధవారం మహాత్మా గాంధీ తీర్థం ఘనంగా నిర్వహించారు. గాంధీ వీధిలోని జాతిపిత విగ్రహానికి గాంధీ ఉత్సవ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు దాడి రాము ఆధ్వర్యంలో సర్పంచ్ జామి రమణబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ త్యాగనిరతిని స్థానిక పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కాళ్ల అప్పలనాయుడు, దాడి రాము, విశ్రాంతి ఉపాధ్యాయులు కాళ్ల అమ్మతల్లి నాయుడు వివరించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలతోపాటు సైకిల్ స్లో, స్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భీశెట్టి జగ్గప్పారావు, స్థానిక నాయకులు మాలినాయుడు, మళ్ల కన్నబాబు, బి.జగ్గారావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సూరిశెట్టి గోవిందరాజులు, ఆదారి వెంకట సూరిప్పారావు, ఆదారి శంకర్, స్థానికులు కె.రఘు, ఎం.వి.సత్యనారాయణ, కె.పి.ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

హోమియోతో ప్రమాదకర వ్యాధుల నివారణ

అనకాపల్లి: హోమియో వైద్యం ద్వారా ప్రమాదకరమైన వ్యాధులను నివారించవచ్చని ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంతి లెక్చరర్ కొయిలాడ రామ్మోహనరావు అన్నారు. స్థానిక కోటపర్తి అప్పారావు ఉపాధ్యాయ భవనంలో బుధవారం భారతి వికాస్ పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్లోపతి వైద్యం కన్నా హోమియో వైద్యం కాస్త ఆలస్యంగా పని చేస్తుందని చెప్పారు. హోమియో వైద్యంతో క్యాన్సర్ నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టాలో వివరించారు. అంతకు ముందు రామ్మోహనరావును పరిషత్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యులు ఎ.ఓంరాం, బీఏవీ వర్మ, బుద్ధ అప్పారావు, కె.రమణ అప్పారావు, వి.ఈశ్వరరావు, ఏవీ బ్రహ్మానందం, కాంద్రేగుల అప్పారావు పాల్గొన్నారు.